సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 15 । నవంబర్ । 2023



దూషణలకు పాల్పడితే చర్యలు

సామాజిక మాధ్యమాలలో అసభ్యకరంగా, విద్వేషపూరితంగా పోస్టులను ప్రచురించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరించారు. -8లో



అందరికీ ఆమోదయోగ్యంగా భూ పరిహారం

భూసేకరణకు సంబంధించి రైతులందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని జేసీ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 310 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	445	445
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 143.920 కిలోలు

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామస్వామి హుండీ లెక్కింపు ఆలయ రంగమండపంలో మంగళవారం జరిగింది. రూ.5,79,140 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యా దీవెన కోసం అకౌంట్స్ ఓపెన్ చేసుకోండి

రాయచోటిటౌన్ : జగనన్న విద్యా దీవెన కోసం తల్లులతో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని అన్నమయ్య జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ శాఖ సాధికారిత అధికారి జాకీర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల ప్రిన్సిపల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 28వ తేదీన జగనన్న విద్యా దీవెన నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేయనున్నారని తెలిపారు. ఈ పథకంలో తల్లితోపాటు విద్యార్థికి కూడా భాగస్వామ్యం కల్పించడానికి ఈ నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 8 నియమాలు అమలు చేశారని తెలిపారు. వివరాలకు సచివాలయాల్లో లేదా కళాశాలల్లో సంప్రదించవచ్చు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఈ ఎస్ రమణ

రాయచోటి: అక్రమ చౌర్యానికి గురవుతున్న విద్యుత్ వినియోగంపై కఠిన చర్యలు చేపట్టాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ రమణ కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్ఈ డివిజన్ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని రాయచోటి, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సుండుపల్లె, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి మండలాల క్షేత్రస్థాయి అధికారులతో విద్యుత్ ప్రగతి, బిల్లులు వసూళ్లు, అక్రమ వినియోగంపై సమీక్షించారు. జగనన్న కాలనీలలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్లు, ట్రాన్సు ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.


రూ.7.89 కోట్లు బకాయిలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని కడప డివిజన్‌లో రూ. 7.89 కోట్లు మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని ఎస్ఈ అన్నారు. విద్యుత్ బకాయిలు వసూళ్లపై అత్యధిక ప్రాధాన్యతతో దృష్టిసారించాలన్నారు.

'108'లో ఉద్యోగాలు

కడప రూరల్: 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో ఈఎంటీ(ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్) ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా మేనేజర్ సురేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీజెడ్‌సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఏఎన్ఎం, జీఎన్ఎం విద్యార్హతగలవారుంటే ఈ నెల 15, 16వ తేదీల్లో కడప పాత రిమ్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

వైవీయూలో ఆనర్స్ డిగ్రీ కోర్సు



మాట్లాడుతున్న వీసీ చింతా సుధాకర్


వైవీయూ: యోగి వేమన విశ్వ విద్యాలయం పీజీ కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలో మంగళవారం జరిగిన జాతీయ నూతన విద్యా విధానం-2020 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన విద్యార్థులు, ఏపీ పీజీసెట్ రాసి సీటు పొందని విద్యార్థులు, ఇన్‌స్టంట్‌లో ఉత్తీర్ణులైనవారు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 డిగ్రీ కళాశాలల్లో ఆనర్స్ నాలుగేళ్ల కోర్సులో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అప్లైడ్ మ్యాథమ్యాటిక్స్, ఫిజిక్స్, జియాలజీ, బోటనీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, జువాలజీ, సైకాలజీ, కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చన్నారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆసక్తిగల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.yvu.edu.inలోకి వెళ్లి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 25వ తేదీలోగా వైవీయూలో సమర్పించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏ.జీ.దాము పాల్గొన్నారు.

బడి బలోపేతమే లక్ష్యం

- ఫలితమిస్తున్న ఇద్దరు ఎంఈఓల ఫార్ములా
- బోధన, నిర్వహణపై తరచూ తనిఖీలు
- ప్రభుత్వ విధానాలు అమలయ్యేలా చర్యలు



తరగతి గదిలో విద్యార్థులు



మదనపల్లె సిటీ: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలను చేపట్టింది. బోధన...సకాలంలో సిలబస్ పూర్తి చేయడం.. పరీక్షల నిర్వహణ.. ఉపాధ్యాయుల విధులు... తదితరాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పూర్తిస్థాయిలో వసతుల కల్పనే లక్ష్యంగా ప్రతి మండలానికి ఇద్దరు ఎడ్యుకేషన్ ఆఫీసర్లను నియమించింది. వీరికి పని విభజన కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

- రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపడుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మీడియం, వర్చువల్ బోధన, టోఫెల్ విధానంలో పరీక్షలు, సీబీఎస్ఈ సిలబస్, విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితరాలను పక్కాగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రభుత్వ పాఠశాలల్లోనూ పకడ్బందీగా అమలయ్యేలా ఇద్దరు ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు.

ఇష్టారాజ్యానికి చెక్

పరీక్షల నిర్వహణలో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక నుంచి వీరి ఆటలు సాగేందుకు అవకాశం ఉండదు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్దేశించిన నిబంధనల మేరకు పరీక్షలు, బోధన తదితరాలను పక్కాగా అమలు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి అకడమిక్ పుస్తకాలతో విద్యాబోధన సాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా తరగతులకు ఫార్మెటివ్,సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. ఈ నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. అకడమిక్ పుస్తకాలను వినియోగించకుండా సొంత మెటీరియల్‌ను విద్యార్థులకు అంటగట్టి ఇష్టారాజ్యంగా బోధన సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారాలను చక్కదిద్దేందుకుగానూ ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నియమించింది.

ఎంఈఓల విధులు ఇలా...

జిల్లాలో 30 మండలాలకు గానూ 30 మంది ఎంఈఓలను అదనంగా నియమించారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలను సందర్శించడం, తనిఖీ, ఉపాధ్యాయుల శిక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన కార్యక్రమాలు అమలయ్యేలా పర్యవేక్షణ.. పాఠశాలల్లో అవసరమైన వాటిని అంచనా వేసి బాధ్యత ఎంఈఓ-1కు కేటాయించారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా పాఠశాలల స్థాపన , గుర్తింపు,బలోపేతం చేయడం , ఉపాధ్యాయుల సర్వీస్ అంశాలతో పాటు అధికారులు కేటాయించిన ఇతర విధులను వీరు నిర్వహించనున్నారు.

పాఠశాలల్లో సంసిద్ధత

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం,ఒకేషనల్ ఎడ్యుకేషన్, ప్రత్యేకావసరాలు గల పిల్లలకు సంబంధించి విషయాలు .చైల్డ్ డేటా బేస్ యూ డైస్ నిర్వహణ తదితరాలను ఎంఈఓ-2 పర్యవేక్షించాల్సి ఉంటుంది. నాడు-నేడు, ఇన్‌ఫ్రాస్టక్చర్,లెర్నింగ్ మెటీరియల్ టు స్టూడెంట్స్, మధ్యాహ్న బోధన విధులు, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాలు, పాఠశాలల భద్రతతో పాటు అధికారులు కేటాయించిన ఇతర విధులను వీరు నిర్వర్తించాలి.

జిల్లాలో మండలాలు: **30**



ప్రభుత్వ పాఠశాలలు: **2213**



విద్యార్థులు : **1,54,789**



పర్యవేక్షణ పెరుగుతుంది



ఎంఈఓ-1,2 కు విధులు కేటాయింపులో పాఠశాలలపై పర్యవేక్షణ పెరుగుతుంది. అకడమిక్, పాఠశాలల నిర్వహణను ఇద్దరు ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు. వీరికి విధుల కేటాయింపుతో విద్యార్థుల ఫలితాలు ఆశించిన స్థాయిలో వస్తాయి. ఎంఈఓలు ఆయా మండలాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అకడమిక్ క్యాలెండర్, ప్రభుత్వ పథకాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

-శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

27 నుంచి కులగణన



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 10వ తేది వరకు కులగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కులగణన, వికసిత్ భారత్, ఆడుదాం ఆంధ్ర, రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు తదితర అంశాలపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ కులగణన కార్యక్రమానికి తహశీల్దార్లు మండలస్థాయిలో నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమం గురించి ఇంటింటికి తెలియజేయాలని ఆదేశించారు.

ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష...

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటలు ఉంటాయని, సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఆటలను నిర్వహించాలని తెలిపారు. సచివాలయం, మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి ఆటలు ఉంటాయని తెలిపారు. వలంటీర్ల ద్వారా నవంబర్ 25వ తేది నుండి ఈ కార్యక్రమం గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర అనే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి వాటి లబ్ధిపొందని వారి కోసం ఈనెల 15 నుంచి జనవరి 26వ తేదివరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

రెడ్ క్రాస్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. వారి సేవలను అన్నమయ్య జిల్లాలో పొందుపరిచేందుకు కృషి చేయాలని తెలిపారు. సెరికల్చర్ అధికారి రాజశేఖర్ రెడ్డి అందించే పుస్తకాలు ద్వారా నమోదు ప్రక్రియను పెంచి రెడ్‌క్రాస్ సొసైటీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

కిడ్డీ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ గిరీషా పీఎస్



కిడ్డీ బ్యాంక్ కిట్లను ఖాతాదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఛైర్‌పర్సన్

రాయచోటి: సహకార బ్యాంకులు ప్రారంభించిన కిడ్డీ బ్యాంకును పిల్లలు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో 'భారతదేశ ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్‌కి పెంచడంలో సహకార సంఘాల పాత్ర' అనే థీమ్‌తో 70వ సహకార వారోత్సవాలను జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార బ్యాంకులు మంచి వృద్ధి సాధించి వ్యవసాయరంగంలో ఉండే వారికి రుణాలు ఎక్కువగా ఆదుకోవాలని సూచించారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా డీసీసీబీ వారు ప్రారంభించిన కిడ్డీ బ్యాంక్ అనే వినూత్న కార్యక్రమం చాలా ఉపయోగకరమని, తల్లిదండ్రులు దీనిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల సేవలు ఎంతో ప్రధానమని కొనియాడారు. జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాష్, వైఎస్సార్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ ఝాన్సీరాణి మాట్లాడారు. అనంతరం అన్నమయ్య జిల్లాలో బ్యాంకు ఖాతాలు తెరిచిన కొంత మంది చిన్నపిల్లలకు వారి పేరుతో కిడ్డీ బ్యాంక్ కిట్లను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగులకు ఆరోగ్యబీమా కార్డులను అందజేశారు. నాబార్డ్ డీడీఎం విజయవిహారి, డీసీసీబీ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం



రాయచోటి మున్సిపల్ సభాభవనం సుందరంగా తయారైంది. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో రూ.2.40 కోట్లతో నూతన మున్సిపల్ సభాభవనం సుందరంగా ముస్తాబైంది. ఈ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. కలెక్టర్ గిరీషా పీఎస్ హాజరుకానున్నారు. ఉదయం 9గంటలకు ప్రారంభం.. అనంతరం సమావేశం జరుగనుంది.

-రాయచోటి అర్బన్

చలికాలం.. జర భద్రం

జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. రెండు, మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆహారపానీయాలు, దుస్తులు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు చెబుతున్నారు.


- క్రమంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మెల్లగా పెరుగుతున్న చలి
- ఆహారవిహారాల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్న నిపుణులు





సాక్షి, కడప డెస్క్: చలికాలం మొదలైంది. రెండు, మూడు నెలలపాటు వణుకు పుట్టిస్తుంది. వాతావరణంలో అనేక మార్పులు వస్తాయి. ఆరోగ్యంపై ఏ మాత్రం అలక్ష్యం వహించినా రోగాల బారిన పడక తప్పదు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, శ్వాస కోశ వ్యాధులున్న వారు చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. చలి కాలంలో సాయంత్రం నుంచి వీలైనంత వరకు ఇంట్లోనే ఉండే ప్రయత్నం చేయాలి. ఇక ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఫ్రిజ్‌లో ఆహారం తినవద్దు



చలికాలంలో మనం తీసుకునే ఆహారం పట్ల జాగ్రత్తలు వహించాలి. ఫ్రిజ్ లో వుండే ఐటమ్స్ అస్సలు తినరాదు. కేవలం వేడిగా ఉండే ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. చలికాలంలో మద్యంతో పాటు టీ, కాఫీలను అధికంగా తాగుతారు కొందరు. ఇలా అస్సలు చేయరాదు. మద్యానికి దూరంగా ఉండాలి. టీ, కాఫీ రోజుకు రెండు మూడు కప్పులు తీసుకోవచ్చు. అలాగే కషాయాలు, హెర్బల్ టీలను తాగవచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగినంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి మూడు రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

ఆస్తమా ఉందా.. తస్మాత్ జాగ్రత్త



ఆస్తమా ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. కూల్ డ్రింక్స్, ఉప్పు అధికంగా వున్న పదార్థాలు.. ప్యాక్డ్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తీసుకోరాదు. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా వున్న పదార్థాలు తీసుకోవాలి. రెండు చెంచాల వెల్లుల్లి, అల్లం కలిపిన టీ, వేడి నీటిలో తేనె కలుపుకుని రోజూ తీసుకుంటే వ్యాధిని నియంత్రించుకోవచ్చు. మెంతులు వేడినీటిలో తడిపి, వెల్లుల్లి రసం అరస్పూన్, తేనెను కలిపి రోజూ తాగితే ఉపశమనం పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

గుండెకు చలి తిప్పలు




వాతావరణంలో వచ్చే మార్పులు శరీరంపై రకరకాల ప్రభావాల్ని చూపిస్తాయి. చలికాలంలో హార్ట్ పేషెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో అడ్రినలిన్, నారిటలిన్ వంటి కొన్ని హార్మోన్ల లెవల్స్‌లో మార్పులొస్తాయి. ఇవి రక్తప్రసరణలో మార్పులు తెస్తాయి. అలాగే చలి కాలం రక్తనాళాలు సహజంగా ముడుచుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటప్పుడు కొలెస్ట్రాల్ వంటి సమస్యలు పెరిగే ప్రమాద ముంది. కాబట్టి చలి కాలం గుండె సమస్యలున్నవాళ్లు వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తుండటం ద్వారా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూసుకోవచ్చు.

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే..

రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు ముఖ్యమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లరాదు. ఇంటి లోపలి ప్రదేశాలు వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులను కచ్చితంగా మూసేయాలి. రూమ్ హీటర్లను వాడటంతో వెచ్చగా ఉండవచ్చు. పండ్లు, కాయగూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్ఫెక్షన్లు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. అస్తమా సీఓపీడీ, బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాస కోశ సమస్యలుంటే జాగ్రత్తగా ఉండాలి. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, ఐస్ వాటర్‌కు దూరంగా ఉంటే మంచిది. ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండరాదు.

పెదాలు, కురులపై శ్రద్ధ అవసరం




చలి కాలంలో పెదాలు పగలకుండా ఉండాలంటే టిప్స్ పాటించాలి. పొడిగా వదిలేయకుండా, నాణ్యత కలిగిన లిప్ లోషన్ పెదాలకు అప్లై చేయాలి. బి విటమిన్‌తో పాటు, ఎక్కువ నీరు తీసుకుంటే పెదాలు పొడి బారకుండా ఉంటాయి. ఈ కాలంలో రంగులు ఉపయోగించడంతో కురులు పొడిగా మారి అలర్జీకి కారణమవుతాయి. చర్మంపై దద్దుర్లకు దారి తీస్తాయి. మూడు రోజులకోసారి తలస్నానం చేస్తే సరిపోతుంది.

వస్త్రమే ఆయుధం

చలి నుంచి రక్షించుకోవడానికి దుస్తుల విషయంలో కచ్చితంగా మార్పులు చేసుకోవాలి. వెచ్చని అనుభూతి అందించే దుస్తులు ఇప్పుడు మార్కెట్‌లో కొలువు దీరాయి. పలుచని దుస్తులను వేస్తే కచ్చితంగా రెండేసి చొప్పున ధరించాలి. అలాగే ఉన్నితో తయారుచేసిన స్వెటర్లు, మంకీ క్యాప్స్, స్కార్ఫ్‌లు, చేతులకు గ్లోవ్స్ ఇంకా కాళ్లకు సాక్స్ ధరించాలి. ఎందుకంటే ఇవి మనల్ని వెచ్చగా ఉంచి చలి బారి నుంచి సంరక్షిస్తాయి. దీంతో పాటు పొడిగా ఉండే దుస్తులను మాత్రమే ధరించాలి. దుస్తులు తడిగా ఉంటే మనం అధిక చలిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే శరీరం తడిగా ఉన్నా కూడా ఎక్కువ చలిగా అనిపిస్తుంది.

వ్యాయామం తప్పనిసరి



చలి వేస్తే చాలు.. వ్యాయామానికి స్వస్తి చెప్పి దుప్పట్లో దూరిపోతారు. మరింత మంది ఎక్కువగా చలిలో వ్యాయామం చేస్తారు. కానీ ఈ సీజన్‌లో జాగ్రత్తలతో వ్యాయామం చేయడం తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని నిపుణులు చెబుతున్నారు.

నిపుణులతో చికిత్స అవసరం

చలికాలంలో రకరకాల వ్యాధులు చుట్టుముట్టడం సహజం. ఆహారం, దుస్తులు తదితర విషయాల్లో జాగ్రత్త ఎంత అవసరమో.. అనారోగ్యం బారిన పడినపుడు తమకు తోచిన వైద్యం చేసుకోకపోవడం అంతే మంచిది. సమస్యను బట్టి వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. సొంత వైద్యం చేసుకోవడం మంచిది కాదు.

ఆహార జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలంలో సహజంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. జలుబు, దగ్గు త్వరగా దాడి చేస్తుంటాయి. ఆహారం అరుగుదల తక్కువ. వీటిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలి. గుడ్లు, చేపలు శరీరానికి తప్పక అవసరం. వేడిగా వండిన వంటలే ఉత్తమం. జామ, దానిమ్మ, బొప్పాయి, అరటిపండ్లు మంచివి.

– డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్, ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి, కడప

పిల్లల విషయంలో జరభద్రం



చాలా మంది పిల్లలు సాయంత్రం ఆటలాడటానికి బయటకెళ్తారు. అయితే చలి ప్రభావం వీరిపై అధికంగా ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇబ్బందులు వారికి తొందరగా చుట్టుముడతాయి. చీకటి పడే వరకు పిల్లలను బహిరంగ స్థలాల్లో ఆడించకపోవడమే మంచిది. కాచి చల్లార్చిన నీటిని అందివ్వాలి.

– డాక్టర్ కరుణాకర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, రిమ్స్, కడప

క్లుప్తంగా

అన్నావదినపై దాడి

మదనపల్లె : ఆస్తి విషయమై అన్నావదినపై దాడి చేసిన సంఘటన మంగళవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కలిచెర్ల పంచాయతీ నత్తన్నగారిపల్లెతండాకు చెందిన నర్సింహులునాయక్ కుమారులు శ్రీనునాయక్, సీతారాంనాయక్ ఉమ్మడిగా.. గ్రామంలో ఓ ఇల్లు, మదనపల్లె వద్ద కొంత ఖాళీ స్థలం కొనుగోలు చేశారు. ఆస్తిని తమ్ముడు సీతారాంనాయక్ పేరుపై ఉంచారు. ఈక్రమంలో మంగళవారం ఆస్తి విషయమై శ్రీనునాయక్ అతడి భార్య సాలమ్మ సీతారాంనాయక్ తమ వాటా పంచి ఇవ్వాల్సిందిగా అడిగారు. దీంతో నీకు వాటా ఇచ్చేది లేదంటూ వారితో గొడవకు దిగి వారిపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన సాలమ్మ అపస్మారకస్థితికి చేరుకోగా, శీనునాయక్ గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైపాడు బీచ్‌లో మునిగి యువకుడి మృతి

ఇందుకూరుపేట : స్నేహితులతో సరదాగా సముద్రంలో మునిగేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని మైపాడు బీచ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణానికి చెందిన సయ్యద్ జావీద్(26) కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి తొమ్మిది మంది కారులో సేదతీరేందుకు మైపాడు బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో అలల ఉద్ధృతికి జావీద్ నీటమునిగి గల్లంతయ్యాడు. సహచరులు తీవ్ర ఆవేదనతో తీరం వెంట వెతుకుతూ ఉండిపోయారు. సుమారు గంట సేపటికి జావీద్ విగతజీవిగా మారి ఒడ్డుకు చేరుకున్నాడు. దీంతో బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అల్పపీడనం కారణంగా సముద్రం కసురుగా ఉందని, తీరానికి వచ్చే వారు అప్రమత్తంగా ఉండాలని సీఐ హెచ్చరించారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున కార్తీక మాసం సందర్భంగా సముద్రంలో పుణ్యస్నానాలు అచరించేవారు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

సామాజిక మాధ్యమాల్లో
దూషణలకు పాల్పడితే చర్యలు

రాయచోటి : సామాజిక మాధ్యమాలలో అసభ్యకరంగా, విద్వేషపూరితంగా, అవమానకరమైన పోస్టులను ప్రచురించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్వేష పూరిత పోస్టులు చేస్తున్న చింతా సుదర్శన్(32) అరెస్టుపై ఎస్పీ వివరించారు. జిల్లా పరిధిలోని పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామానికి చెందిన చింత సుదర్శన్ టీడీపీ అనుచరులతో సంబంధాలు ఏర్పరచుకొన్నారన్నారు. ఇతను బి.ఫార్మసీ పట్టభద్రుడిగా పట్టా పొంది హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో పని చేస్తుండే వారన్నారు. అనారోగ్య కారణాల వల్ల గత ఏడాది నుంచి రాజంపేటలో ఉంటున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. టీడీపీ అనుచరులతో ఏర్పడిన సంబంధాల


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

కారణంగా వాట్సాప్ గ్రూపులలో మెంబర్‌గా చేరి కంటెంట్ సమూహంలో భాగస్వామ్యం అయ్యారన్నారు. ప్రతి నెల టీడీపీ వారి నుంచి ఎనిమిది వేల రూపాయలు జీతం రూపంలో తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో నకిలీ పేర్లతో నకిలీ ఫేస్‌బుక్ ఐడీలు, ఈమెయిల్ ఐడీలను సృష్టించారన్నారు. వాటి ద్వారా దుర్వినియోగంగా ప్రేరేపించేలా సోషల్ మీడియా కంటెంట్‌ను ప్రచురించి ప్రసారం చేసేవాడన్నారు. సంస్థలు, రాజకీయ నేతలపైన అవమానకరమైన సందేశాలను పోస్ట్ చేయడానికి చిత్రలహరి పేరుతో ఫేస్‌బుక్ పేజీని సృష్టించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఫేస్‌బుక్ ద్వారా కమ్యూనిటీ ప్రమాణాలను ఉల్లంఘించినందున ఫేస్‌బుక్ పేజీకి రిపోర్ట్ చేసి బ్లాక్ చేయించామన్నారు. ఉద్యోగం ముసుగులో అమాయక యువతను గ్రూపులో చేర్చుకున్న వ్యక్తులను గుర్తించడానికి దర్యాప్తు శరవేగంగా జరుగుతోందని ఎస్పీ చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను గుర్తించుకోవాలని యువతకు సలహా ఇచ్చారు. యువత ఇలాంటి మోసపూరిత వారి మాటల్లో పడి మోసపోవద్దని ఎస్పీ ఉపదేశించారు. కెరీర్ భవిష్యత్తు అవకాశాలను ప్రభావితం చేసే చట్టపరమైన చర్యలతో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

అందరికీ ఆమోదయోగ్యంగా భూపరిహారం

మదనపల్లె : ఎన్‌హెచ్–71, ఎన్‌హెచ్–42లను కలుపుతూ తట్టివారిపల్లె వెంగమాంబసర్కిల్‌లో ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులకు చేస్తున్న భూసేకరణకు సంబంధించి రైతులందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీతో కలిసి మండలంలోని బండమీదకమ్మపల్లె, వెంకప్పకోట, బసినికొండ రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఎన్‌హెచ్–71లో భూములు కోల్పోతున్న రైతులతో పరిహారం నిర్ణయానికై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ల వారీగా రైతుల నుంచి సేకరిస్తున్న భూ వివరాలను జేసీ సమక్షంలో రెవెన్యూ అధికారులు సమావేశంలో చదివి వినిపించారు. భూసేకరణలో ఏమైనా అభ్యంతరాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణం తప్పులు, యజమాని పేరు మార్పు తదితరాలు తెలపాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించి జరుపుతున్న భూసేకరణకు రైతులు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ యాజమాన్య హక్కులకు సంబంధించిన రికార్డులను వీఆర్వో లేదా సంబంధిత అధికారులకు అప్పగిస్తే వాటి ప్రకారం అవార్డు నిర్ణయించి త్వరితగతిన పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2013 భూసేకరణ, పరిహారం చట్టంను అనుసరించి బండమీదకమ్మపల్లె పంచాయతీలో భూపరిహారానికి సంబంధించి ఎకరాకు రూ.1 కోటి 26 లక్షల10 వేలు, ఇంటి స్థలాలకు చదరపు గజానికి రూ.19,419 నిర్ణయించామన్నారు. అలాగే బసినికొండలో ఎకరా భూమికి రూ.55.14 లక్షలు, ఇంటి స్థలానికి రూ.7,280 చదరపు గజానికి, వెంకప్పకోటలో ఎకరా భూమికి రూ.28.47 లక్షలు, ఇంటి స్థలానికి 3,958 చదరపు గజానికి భూపరిహారం ధరగా నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు భూములు తప్ప వేరే జీవనాధారం లేవని, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం తమకు ఏమాత్రం సరిపోదని అభిప్రాయం వెలిబుచ్చారు. అభివృద్ధి పనులకు సహకరించాల్సిన బాధ్యత తమపై ఉన్నందున ప్రభుత్వం నిర్ణయించిన పరిహారానికి అదనంగా ఇంటిస్థలం మంజూరు చేయడంతో పాటుగా మొత్తాన్ని పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ శేషయ్య, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఎన్‌హెచ్ఏఐ ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

దుకాణంలో చోరీ

నందలూరు (రాజంపేట): వరుస దొంగతనాలతో నందలూరు మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిద్రిస్తున్న అవ్వ మెడలో బంగారు తాళి సరుడు లాక్కెళ్లారు అనే సంఘటన మరువక ముందే ఆలయాలను టార్గెట్ చేస్తున్నారు. నేడు ఏకంగా బస్టాండ్ కూడలిలోనే గంటపాటు ఓ దుకాణంలో తీరిగ్గా కూర్చొని చోరీ చేసిన సంఘటన సీసీ కెమెరాలలో కూడా నమోదు కావడం గమనార్హం. అసలు ఈ దొంగతనాలపై కేసులు నమోదవుతున్నాయా, దొంగలు దొరికేనా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక బస్టాండ్ కూడలిలోని పాకాటి చందు ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్‌కు చెందిన దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రూ.30 వేల విలువజేసే సిగరేట్ ప్యాకెట్లు, రూ.10 వేల విలువజేసే చాక్లెట్లు పోయినట్లు దుకాణం యజమాని తెలిపారు. మంగళవారం ఉదయం బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దుకాణం ఎదురుగా ఉన్న ఓ ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అర్ధరాత్రి 12 గంటలకు దుకాణంలోకి వెళ్లిన దొంగ గంటపాటు అక్కడే ఉన్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అలాగే ఈ మధ్యకాలంలో ఒకే రోజు నాలుగు ఆలయాలలో చోరీలు జరిగాయి. అది మరువకముందే ఆల్విన్ కర్మాగారం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం స్థానిక బస్టాండ్ కూడలిలో చోరి జరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇప్పటికైనా రాత్రి వేళల్లో గట్టిబందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాటి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమస్యలు

శ్రీరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చైర్మన్ శివారెడ్డి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం అయిన పంప్ హౌస్ నిర్మాణంలో అప్పటి ప్రభుత్వం టీడీపీ చేసిన నిర్లక్ష్యం వల్లే నేడు ఈ పైపులు పగిలిపోవడానికి కారణమని శ్రీరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చైర్మన్ ఆకేపాటి శివారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల నుంచి మండలంలో వర్షపాతం అధికంగా కురిసి ఎక్కడ చూసినా పుష్కలంగా నీళ్లు ఉండేవని తెలిపారు. అదే విధంగా ఒంటిమిట్టలో ఉన్న చెరువులో కూడా ఈ నాలుగు సంవత్సరాలు వర్షాలు బాగా కురవడంతో నీళ్లు పుష్కలంగా ఉండటంతో మండల పరిధిలోని కోటపాడు వద్ద ఉన్న శ్రీరామ ఎత్తిపోతల పథకం అయిన పంప్ హౌస్ నుంచి ఒంటిమిట్ట చెరువుకు నీళ్లు వదలే అవసరం రాలేదన్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత 2023లో వర్షపాతం తక్కువ కావడంతో ఇన్నాళ్లకు ఒంటిమిట్ట చెరువులో నీరు ఇంకి పోయాయన్నారు. అందువల్ల ఒంటిమిట్ట చెరువుకు ఇన్ని సంవత్సరాల తరువాత కోటపాడు లోని ఎత్తిపోతల పథకం అయిన పంప్ హౌస్ నుంచి గత నెల 15వ తేదీన రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చొరవతో ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలను వదిలారన్నారు.


పగిలి పోయిన పైపు ఉన్న ప్రదేశంలో పని చేస్తున్న జేసీబీ

ఇక పంప్ హౌస్ నుంచి నీళ్లు వదిలినప్పుడు పైపులు పగిలిపోతున్నాయన్నారు. అది కూడా ఎందుకంటే ఈ శ్రీరామ ఎత్తిపోతల పథకం నిర్మాణం అప్పటి ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ హయాంలో జరిగిందని తెలిపారు. నాసిరకమైన సిమెంట్ పైపులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అందువల్లే గత నెల 15 నుంచి మోటార్లు వేసిన ప్రతి సారి సిమెంట్ పైపులు పగిలిపోవడం, వాటి స్థానంలో తాము ఇనుప పైపులు వేయడం జరుగుతుందన్నారు. ఆ సమస్య పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల ద్వారా ఎస్టిమేషన్ వేయించి పంపించామన్నారు.

శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు చర్యలు

రాయచోటి అర్బన్ : శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో న్యూమోనియా(శ్వాసకోశ వ్యాధుల) నియంత్రణకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ (సాన్స్ సర్వే)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 27 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యూమోనియా వ్యాధి బారిన పడిన వారిలో జలుబు, దగ్గు అధికంగా ఉండడం, వెంట వెంటనే శ్వాసతీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో పక్కటెముకలు కదలడం, అధిక జ్వరం, ఏమితినకపోవడం, తాగకపోవడం, నిద్రమత్తు, నీరసం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేస్తూ పైలక్షణాలు ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు 108 అంబులెన్స్‌ల ద్వారా తరలించడం జరుగుతుందన్నారు. డీఐఓ ఉషశ్రీ మాట్లాడుతూ ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యశాఖ అధికారులు, సిబ్బందిలు పాల్గొన్నారు.


న్యూమోనియా స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

ఆరోగ్య సిబ్బందితో సమావేశం

రామాపురం : స్థానిక ఆరోగ్య కేంద్రంలో న్యూమోనియా ప్రత్యేక డ్రైవ్‌పై డీఎంహెచ్ఓ కొండయ్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి జి.ఉష, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, వైద్యులు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో
మదనపల్లెకు చేరిన బాలిక

- 1098 చైల్డ్‌హెల్ప్‌లైన్‌కు సమాచారమిచ్చిన స్థానికులు
- ఐసీడీఎస్ అధికారుల కౌన్సెలింగ్‌తో ఇంటికి చేరిన వైనం

మదనపల్లె : తెలిసీ తెలియని వయసులో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కాస్తా ప్రేమగా మారి, మైనర్ ప్రియుడి కోసం ఇల్లు వదలి వచ్చిన మైనర్ బాలికకు ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలో 17 ఏళ్ల వయసు గల ఓ బాలుడు ఓ టీషాపులో పని చేస్తూ, ఖాళీ సమయాల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుంటాడు. ఈ క్రమంలో తిరుపతి తనపల్లె క్రాస్‌కు చెందిన 16 ఏళ్ల అమ్మాయితో పరిచయం ఏర్పడింది. ఆ బాలిక ఇంటి ఎదురుగా ఆ బాలుడి అత్త ఇల్లు ఉండటంతో.. అక్కడికి వెళ్లి వస్తూ, ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వీరి ప్రేమవ్యవహారం దాదాపు ఏడాదికి పైగా నడిచింది. విషయం తెలిసిన అమ్మాయి తల్లిదండ్రులు కూతురిని మందలించడంతో.. వారిద్దరూ ఆ యువకుడి అత్తతో కలిసి ఒకటిన్నర నెల క్రితం మదనపల్లెకు వచ్చి వారి ఇంట్లోనే ఉంటున్నారు. ఆ బాలుడి అత్త డిసెంబర్ 9న వీరిద్దరికీ వివాహం చేసేందుకు నిర్ణయించుకుని, పెళ్లికి ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో మైనర్ బాలుడు, బాలికకు పెళ్లి జరుగుతోందని స్థానికంగా ఉన్న కొందరు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించారు. వారు స్థానిక ఐసీడీఎస్ అధికారులను అప్రమత్తం చేయడంతో మదనపల్లె సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ చంద్రకాంత, సచివాలయం మహిళా కానిస్టేబుల్ సహాయంతో వారి ఇంటికి వెళ్లారు. వారిద్దరినీ తీసుకుని, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారి నుంచి జరిగిన విషయం తెలుసుకుని, మైనర్ల వివాహం చట్టరీత్యా నేరమని, చెల్లదని కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయికి మంచిమాటలు చెప్పి తల్లిదండ్రులకు సమాచారం అందించి తిరుపతిలోని హోమ్‌కు పంపారు. అబ్బాయిని టూటౌన్ ఎస్ఐ వెంకటేష్‌కు సరెండర్ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

రాయచోటి టౌన్ : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. అన్నమయ్య జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించే క్రమంలో రాయచోటిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండయ్య, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శైలజలు వైద్యసిబ్బందితో కలసి ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందుగా రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ /ఎయిడ్స్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.ఆలీముల్లా, డీఆర్‌పీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం స్మగ్లర్ల అరెస్ట్

రామాపురం : రాయచోటి రేంజ్ పరిధిలోని వంగిమళ్ల సెక్షన్ అధికారి జి.భరణి కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతి పల్లె బీటులో ఆదివారం కుంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారు రేణిమాకుల గరుగు ప్రదేశంలో శ్రీ గంధం మొక్కల జిగురును తీస్తుండడంతో పట్టుకున్నారు. వారి నుంచి 100 మొక్కలు కలిగిన 37 కేజీలతో శ్రీ గంధం, నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో మండలంలోని గంగనేరుకు చెందిన మల్లిక రమణ, మల్లిక హరికృష్ణ, గువ్వలచెరువు గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన మల్లిక వీర నాగయ్య, నీలం రవీంద్ర ఉన్నారు. 37 కేజీల శ్రీగంధం విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని సెక్షన్ అధికారి జి.భరణి కుమార్ తెలిపారు. అంతేకాకుండా అడవి జంతువులను కాల్చి చంపితినుట కోసం వారు ఒక నాటు తుపాకీని వెంట పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను లక్కిరెడ్డిపల్లె కోర్టులో హాజరుపరిచి రిమాండు నిమిత్తం సబ్‌జైలుకు తరలించినట్లు మంగళవారం తెలియజేశారు. ఈ కుంబింగ్‌లో ఆర్.రెడ్డప్ప, ఎస్.మహబూబ్‌బాషా, బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ నాగశేషు, గురయ్య, జయరాము, రమణ, రెడ్డయ్య, శ్రీను, గోపాల్ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, చిన్నరెడ్డయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.


శ్రీగంధం, నిందితులతో ఫారెస్టు అధికారులు, సిబ్బంది

మహిళ ఆత్మహత్య

రాజంపేట : మండల పరిధి మదనగోపాలపురంలోని అద్దెపల్లె ప్రకాశరాజు మామిడి తోటలో కాపాలగా ఉంటున్న కృష్ణవేణి(23) ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు మంగళవారం మన్నూరు పోలీసులు తెలిపారు. సోమవారం భర్త వాసుతో గొడవపడి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ కుటుంబం పెనగలూరు మండలంలోని సిద్దవరానికి చెందిన వారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మదనపల్లె మండలం గొల్లపల్లెకు చెందిన ఓబులేషు భార్య గాయత్రి(26) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా చౌడేపల్లె మండలం గట్టువారిపల్లెకు చెందిన దొరస్వామి భార్య రాజేశ్వరి కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనాల్లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఎస్.రవి (ఫైల్)

కలికిరి : రైల్వేట్రాక్‌పై ఆర్టీసీ డ్రైవరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు–కలికిరి మార్గంమధ్యలో కంచంవారిపల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు కలికిరి, కదిరి రైల్వే ఎస్ఎంఆర్‌ల సమాచారం మేరకు మంగళవారం ఉదయం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి కొంత దూరంలో ద్విచక్రవాహనం ఉంది. దీంతో మృతుడు కలికిరి మండలం గుట్టపాళెం గ్రామం నల్లగుట్ట దళితవాడకు చెందిన సాలి రవి(52)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని భార్య ఎస్.రెడ్డెమ్మ తన భర్త రవి సోమవారం ఉదయం డ్యూటీకి బయల్దేరి వెళ్లాడని, ఫోన్ స్విచ్ఛ్‌ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో ఆయన కోసం పీలేరు డిపో కార్యాలయంలో విచారించినా డ్యూటీకి రాలేదని చెప్పారని, భర్త మృతి పట్ల అనుమానాలున్నాయని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని..

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని శంకరాపురం (రాజంపేట మండలం) వద్ద లక్ష్మీదేవి(60) అనే వృద్ధురాలిని మంగళవారం లారీ ఢీకొంది. ఈమె రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఈమెను మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల కుంటలో పడి యువకుడి మృతి


మృతి చెందిన రఫీక్‌అహ్మద్

నిమ్మనపల్లె : చేపలకుంటలో పడి ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. స్నేహితులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. మదనపల్లె పట్టణం లచ్చన్నవీధికి చెందిన షేక్ అబ్దుల్‌రజాక్, మస్తాన్‌బీ దంపతుల పెద్దకుమారుడు రఫీక్‌అహ్మద్ స్థానికంగా క్యాటలిక్ సొల్యూషన్స్ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలో నజీర్ వద్ద పని చేస్తున్నాడు. తన యజమానితో కలిసి చేపల వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ యర్రాతివారిపల్లె వద్ద ఉన్న చేపల కుంటను పరిశీలించి లీజుకు తీసుకునేందుకు మరో స్నేహితుడితో కలిసి ముగ్గురు వెళ్లారు. చేపలకుంట లోతును పరిశీలించేందుకు రఫీక్‌అహ్మద్ నీళ్లలో దిగి పాచి ఎక్కువగా ఉండటంతో జారి పడిపోయాడని, తాను కాపాడే ప్రయత్నం చేశానని అతడితోపాటు వెళ్లిన నజీర్ చెప్పాడు. చేపలకుంటలో దిగిన రఫీక్ అహ్మద్ మునిగిపోవడంతో అతడిని స్థానికుల సహకారంతో బయటకు తీసి ప్రైవేట్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ఆస్పత్రికి చేరుకున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. ఏం జరిగిందో తెలియక స్నేహితులను విచారణ చేశారు. అయితే.. చేపల కుంటలో పడి మృతి చెందాడని చెప్పిన నజీర్ బట్టలు తడిచి ఉండటం, మృతి చెందిన రఫీక్‌అహ్మద్ శరీరం, బట్టలు పొడిగా ఉండటం, మృతుడి ముఖంపై గాయాలకు వాడే పూత మందు పూసిఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదవశాత్తు చనిపోయాడా..? లేదా మరేదైనా కారణముందా అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రెఫర్ చేస్తే.. నిండుచూలాలైనా వెళ్లాల్సిందే..!

మదనపల్లె : తొమ్మిది నెలలు నిండాక కాన్పు కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చిన ఓ నిండుచూలాలిని మీకు ఇక్కడ వైద్యసేవలు అందించలేమని, తిరుపతికి రెఫర్ చేసిన జిల్లా ఆస్పత్రి సిబ్బంది... 108 అంబులెన్స్ వచ్చేంత వరకు ఆస్పత్రిలో ఉంచుకోకుండా... రెఫర్ చేసేశాం. వెళ్లిపోవాల్సిందేనంటూ ఆస్పత్రి బయటకు పంపేసి, గంటలకొద్దీ ప్రాంగణంలో నిరీక్షించేలా చేసిన ఘటన మంగళవారం జరిగింది. పీటీఎం మండలం కందుకూరు పంచాయతీ నిలువరాతిపల్లెకు చెందిన హుస్సేన్ భార్య సుమేరా(29) తొమ్మిది నెలల గర్భిణి. ఈ క్రమంలో మంగళవారం ఆమెకు వెన్నులో విపరీతమైన నొప్పి రావడంతో ఆశా కార్యకర్త రాధమ్మతో కలిసి స్థానిక జిల్లా ఆస్పత్రికి మంగళవారం ఉదయం వచ్చింది. పరీక్షించిన గైనకాలజిస్ట్ రక్తం తక్కువగా ఉందని, మొదటి రెండు కాన్పులు సిజేరియన్ అయినందున, మూడో కాన్పుకు రిస్క్ ఉండవచ్చని తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా రెఫర్ చేశారు. దీంతో ఆశా కార్యకర్త రాధమ్మ తిరుపతికి వెళ్లేందుకు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. స్థానికంగా ఉన్న వాహనాలు రెఫరల్ కేసుల్లో భాగంగా తిరుపతికి వెళ్లి ఉండటంతో వారికి వాహనం అందుబాటులో లేకుండా పోయింది. దీంతో వారు ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద కూర్చుని ఉండగా, ఆస్పత్రి సిబ్బంది మిమ్మల్ని రెఫర్ చేసేశాక ఇక్కడ ఎందుకు ఉన్నారంటూ.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించారు. 108 వాహనం రావడం ఆలస్యమవుతోందని, అప్పటి వరకు గర్భిణి బయట ఉండలేదని, ఇక్కడ ఉంటామని ప్రాధేయపడినా... వినిపించుకోకుండా 108 వాళ్లు అలాగే చెపుతారు. మీరు వాహనం వచ్చే వరకు మళ్లీ మళ్లీ ఫోన్ చేస్తూనే ఉండండని చెప్పారు. మీరు ఆస్పత్రిలో ఉండి, ఒకవేళ కాన్పు అయిపోతే.. మాకు ఇబ్బందవుతుంది. మీరు బయట ఎక్కడైనా ఉండి.. వాహనం వస్తే వెళ్లిపోండి.. అంతేకానీ ఆస్పత్రిలో ఉండవద్దని బలవంతంగా పంపేశారు. దీంతో చేసేదిలేక నిండుచూలాలు, ఆశాకార్యకర్త సాయంత్రం 6.30 గంటల వరకు ఆస్పత్రి ప్రాంగణంలోనే సిబ్బంది కంటపడకుండా ఓ మూల ఎదురు చూసి, 6.45 గంటలకు 108 వాహనంలో తిరుపతికి బయలుదేరి వెళ్లారు. ఆస్పత్రిలో తమకు ఎదురైన అనుభవాన్ని, సిబ్బంది వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ మీడియాతో ఆవేదన పంచుకున్నారు.